సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
మంగళవారం । 11 । జూన్ । 2024



'చిటుకు'కు చిట్కా..
జీవాలు త్వరగా 'చిటుకు' రోగం బారిన పడకుండా పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు. - 8లో▸



టీజీ ఈ-సెట్ కౌన్సెలింగ్ షురూ..
పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తయిన విద్యార్థులు ఇంజనీరింగ్ 2వ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే ఈ-సెట్ కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
39^0 / 26^0

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు మంత్రి సురేఖ సమీక్ష

వరంగల్ అర్బన్: రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఈనెల 12న(బుధవారం) సాయంత్రం 4 గంటలకు గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాలు, వరద ముంపు కాలనీలు, మేజర్ డ్రెయినేజీలు పూడికతీత, హరితహారం, అభివృద్ధి పనులతోపాటు ఇతర అంశాలపై చర్చించనున్నారు. బల్దియా కమిషనర్, వింగ్ అధికారులు సమావేశానికి హాజరు కావాలని వ్యక్తిగత సలహాదారు ద్వారా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సర్వీస్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



విద్యారణ్యపురి: ఉపాధ్యాయులు సర్వీస్, లీవ్, పెన్షన్ రూల్స్ తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ అన్నారు. సోమవారం హనుమకొండలోని ఆసంఘ భవనంలో ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రిటైర్డ్ లెక్చరర్ రమేశ్ సీసీఏ రూల్స్, సర్వీస్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. రిటైర్డ్ డీటీఓ యాట సత్యనారాయణ పెన్షన్ రూల్స్ గురించి, మాజీ ఎంఎల్సీ కత్తి నర్సింహారెడ్డి ఉపాధ్యాయులు నాయకత్వ లక్షణాల గురించి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు తమ సమస్యలపై పోరాడాలన్నారు. ఎస్టీయూ సీనియర్ నాయకుల పున్న గణేశ్, ఆ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఎ.సదయ్య, రాష్ట్ర బాధ్యులు బి.రవి, ఆర్.సుధాకర్‌రెడ్డి, ఎస్.సాంబయ్య, ఎస్.రమేశ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు కె.రాంబాబు, వి.రాంబాబు, ఎం.మాధురిమయో, డి.నాగరాజు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు సుధాకరచారి, యాకూబ్‌రెడ్డి, రమేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేయొద్దు: డీఈఓ

విద్యారణ్యపురి: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ ఎండీ అబ్దుల్ హై సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థుల నుంచి నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, ఆకర్షణీయ పేర్లతో తల్లిదండ్రులను ప్రలోభాలకు గురి చేస్తున్నట్లు, అవసరంలేని వస్తువులను కొనాలని తల్లిదండ్రులను బలవంతం చేస్తున్నట్లుగా తమకు ఫిర్యాదులొచ్చినట్లు తెలిపారు. అధిక ఫీజుల వసూలు చేసినా, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ఎక్కువ ధరలకు విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేకుండా కొన్ని ప్రైవేట్ పాఠశాలలు నడుస్తున్నట్లుగా సమాచారం ఉందని వాటి యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పీజీ పరీక్షల టైంటేబుల్ విడుదల

కేయూ క్యాంపస్: ఇటీవల వాయిదా పడిన కేయూ పరిధి పీజీ కోర్సుల ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్ఆర్ఎం, తదితర కోర్సుల రెండో సంవత్సరం విద్యార్థులకు రెండో సెమిస్టర్ పరీక్షల టైంటేబుల్ రీ షెడ్యూల్‌ను సోమవారం పరీక్షల విభాగం అధికారులు విడుదల చేశారు. జూలై 1 నుంచి పీజీ కోర్సుల రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్ఎల్ సౌజన్యజీ సోమవారం తెలిపారు. జూలై 1, 3, 5, 8, 10, 12 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

టీచర్ల సీనియార్టీ జాబితా వెల్లడి

విద్యారణ్యపురి: జిల్లాలో ఎస్జీటీ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా.. పదోన్నతుల ప్రక్రియకు సంబంధించిన ఆయా టీచర్ల సీనియార్టీ జాబితాను సోమవారం వెల్లడించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల వాట్సాప్ గ్రూపులకు కూడా సీనియార్టీ జాబితాను డీఈఓ కార్యాలయం నుంచి పంపారు. ఆయా జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. అభ్యంతరాల సవరణ అనంతరం డీఈఓ వెబ్‌సైట్‌లో టీచర్ల పదోన్నతులకు సంబంధించిన సీనియార్టీ జాబితాను అందుబాటులో ఉంచనున్నట్లు సమాచారం. డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఇతర సిబ్బంది రూపొందించిన ఈ సీనియార్టీ జాబితాపై కసరత్తు కొనసాగుతోంది.

ప్రతిపాదనలకే పరిమితం!

నగరంలో వీధి వ్యాపారులకు అడ్డా కరువు
- హాకర్స్ జోన్లు అంతా ఉత్తిమాటే..
- పట్టించుకోని గ్రేటర్ పాలక, అధికార యంత్రాంగం



వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలో రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతున్న చిరు వ్యాపారులు

వరంగల్ అర్బన్: ఆర్టీసీ, రైల్వేస్టేషన్ల సమీపంలో, జంక్షన్లు, ప్రధాన రహదారులను నమ్ముకున్న వీధి వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎండలో, వానలో వ్యాపారం చేస్తూ.. జీవనం సాగిస్తున్నారు. చిరువ్యాపారులకు శాశ్వత చిరునామాగా స్థలాలు చూపించి, హాకర్స్ జోన్లను నిర్మించి అందించడంలో గ్రేటర్ వరంగల్ పాలక, అధికార యంత్రాంగాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రత్యామ్నాయంగా స్టాల్స్ కేటాయించకుండా.. రహదారుల పక్కన, జంక్షన్లలో, రద్దీ ప్రాంతాల్లో చిరువ్యాపారులను కట్టడి చేస్తున్నారు. నిత్యం ఒకవైపు ట్రాఫిక్ పోలీసుల జులుం, మరోవైపు బల్దియా టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది వేధింపులతో ఇబ్బందులు పడుతున్నారు. నగరానికి ఎవరైనా వీఐపీలు వస్తే దుకాణాలు మూసేయిస్తున్నారు. శాశ్వత చిరునామా లేక వ్యాపార, వాణిజ్య షాపుల నిర్వాహకుల బెదిరింపులతో అయోమయానికి గురవుతున్నారు. వీరికి శాశ్వత పరిష్కారం చూపించాలని చిరువ్యాపారుల సంఘాల ప్రతినిధుల డిమాండ్ నెరవేరడం లేదు.

నగరంలో 5,600 మంది చిరువ్యాపారులు

ట్రైసిటీలో సుమారు 5,600 మంది చిరువ్యాపారులున్నారు. వీరికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వరంగల్, హనుమకొండ, కాజీపేటలోని ప్రధాన దారుల వెంట చిరువ్యాపారులు తమ వ్యాపారాలు కొనసాగిస్తూ కుటుంబాల్ని పోషించుకుంటున్నారు. అటకెక్కిన జోన్ల విభజన రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల కిందట చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి స్టాల్స్ కేటాయించాలని నిర్ణయించింది. బల్దియా టౌన్ ప్లానింగ్ విభాగం క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టింది. నగర వ్యాప్తంగా.. 61 ప్రాంతాలను గుర్తించారు. 31 ప్రాంతాల్లో గ్రీన్ జోన్ (వీధి విక్రయ కేంద్రాలు), 14 ప్రాంతాల్లో అంబర్ జోన్లు (సమయానికి అనుగుణంగా వ్యాపారులు), 14 ప్రాంతాల్లో రెడ్ జోన్లు (వీధి వ్యాపారుల నిషేధం)గా గుర్తించారు. ప్రభుత్వానికి నివేదించారు. కానీ.. ఇప్పటి వరకు గ్రీన్, ఆరెంజ్ జోన్లలో వారికి స్థలాలు కేటాయించలేదు. కేవలం సర్వేతో సరిపెట్టారు.



హనుమకొండ బాలసముద్రం రోడ్డు నుంచి బీసీ స్టడీ సర్కిల్ వరకు ఉన్న హాకర్స్ జోన్



నగరంలో రోడ్ల మీదనే వ్యాపారం

10 చోట్ల ప్రతిపాదనలు, ఐదు చోట్ల నిర్మాణాలు

- హాకర్స్ జోన్ల నిర్మాణాలకు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని భావించిన బల్దియా అధికారులు.. 10 చోట్ల నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందుకోసం రాష్ట్ర పురపాలక శాఖ రూ.5.54 కోట్ల నిధులు కేటాయించారు.
- హనుమకొండ కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఆఫీసర్స్ క్లబ్ వరకు, నక్కల గుట్ట జంక్షన్‌లో, హనుమకొండ టీటీడీ కల్యాణ మండపం నుంచి జిల్లా గ్రంథాలయం వరకు, హనుమకొండ బాలసముద్రం రోడ్డు నుంచి సెయింట్ పాల్ స్కూల్ (బీసీ స్టడీ సర్కిల్) వరకు రూ.3.54కోట్లతో హాకర్స్ జోన్లు నిర్మించారు.
- వరంగల్ అండర్ బ్రిడ్జి, కాజీపేట జంక్షన్‌లో రైల్వే స్టేడియం, సోమిడి రోడ్డులో పనులు జరిగే సమయంలో అభ్యంతరాలు వ్యక్తం కావడంతో మధ్యలో నిలిచిపోయాయి. అండర్ బ్రిడ్జి విస్తరణలో కట్టించిన కొన్ని షెడ్లు తొలగించారు.

రాజకీయ జోక్యం..

పూర్తయిన హాకర్స్ జోన్లను నిబంధనల ప్రకారం మెప్మా ఉద్యోగులు గుర్తించి చిరువ్యాపారులకు కేటాయించాలి. కానీ.. ఇందులోనూ రాజకీయ ఒత్తిళ్లు మితిమీరాయి. ఎలాగోలా అర్హులకు, అనర్హులకు గుర్తింపు కార్డులు జారీ చేసి 517 కేటాయించి చేతులు దులుపుకున్నారు. వీటిలో 80 శాతానికిపైగా మంది వ్యాపారాలు నిర్వహించడం లేదు. రోడ్డు పక్కన ఉన్నా.. అనువైన చోట నిర్మించలేదని, వినియోగదారులు ఎవ్వరూ రావడం లేదని చిరు వ్యాపారులు పేర్కొంటున్నారు. వాటిలో వ్యాపారాలు చేయడం లేదు. కొంత మంది అద్దెలకు ఇచ్చుకోగా.. మరికొంత మంది అమ్ముకున్నారు. కొందరు మాత్రం నడుపుకుంటున్నారు. హాకర్స్ జోన్లలో త్రీ వీలర్, టూ వీలర్, దర్జీలు, అల్లికలు, పాన్ షాపులు, చెప్పులు, టీ స్టాల్స్, తదితర షాపులు వెలిశాయి. సగానికిపైగా అనరుల చేతుల్లోకి చేరిపోయాయి. మరికొన్ని ఖాళీగా ఉన్నాయి. ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి కనీస సౌకర్యాలు కల్పించాలని చిరు వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వసతులు కల్పించకపోతే ఎలా?

- నల్లా లేకున్నా బిల్లులు ఎందుకు కట్టాలి?
- అక్రమ కట్టడాలపై అధిక ఫిర్యాదులు
- మూడు నెలల తర్వాత గ్రేటర్ గ్రీవెన్స్ సెల్ ప్రారంభం



వినతులు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ రషీద్, అధికారులు

వరంగల్ అర్బన్: 'ఇంటి పన్ను, చెత్త సేకరణ చార్జీలు, నల్లా బిల్లులు కడుతున్నాం. కనీస వసతులు కల్పించకపోతే ఎలా' అని పలు కాలనీలకు చెందిన ప్రజలు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా మూడు నెలల పాటు నిలిచిన బల్దియా గ్రీవెన్స్ సెల్ సోమవారం పునఃప్రారంభమైంది. అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, వింగ్ అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నల్లా లేకుండా బిల్లు ఎలా చెల్లిస్తామని, అనధికారిక నిర్మాణాలపై అధిక మొత్తంలో ఫిర్యాదులు అందాయి. మొత్తం 58 వినతులు రాగా.. అందులో ఇంజనీరింగ్ సెక్షన్‌కు 22, హెల్త్-శానిటేషన్‌కు 6, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ) 2, టౌన్ ప్లానింగ్‌కు 28 అందినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్ఓ రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హెచ్ఓ రమేశ్, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- 35వ డివిజన్ శివనగర్‌లోని గణపతినగర్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కాలనీవాసులు విన్నవించారు.
- 33వ డివిజన్ 16-3-165 పోచమ్మ టెంపుల్, శాంతినగర్‌లో రోడ్డు మరమ్మతులు చేయాలని క్రాంతికుమార్ విజ్ఞప్తి చేశారు.
- 14వ డివిజన్ శ్రీనివాస కాలనీలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- 3వ డివిజన్ పైడిపల్లి ఆకృతి కాలనీలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్డు మంజూరు చేయాలని కాలనీవాసులు కోరారు.
- 35వ డివిజన్ పుప్పాలగుట్ట విఘ్నేశ్వర కాలనీలో డ్రెయినేజీలు నిర్మించాలని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్ దరఖాస్తు అందించారు.
- కాశిబుగ్గ 11-16-100/2, పాపయ్యపేట చమన్ 15-5-67 నల్లా లేకున్నా.. బిల్లులు వస్తున్నాయని.. మినహాయించాలని రాజేశ్వర్‌రావు, ముజిబుల్ రెహమాన్ వేర్వేరుగా వినతి పత్రాలు అందించారు.
- 32వ డివిజన్ ఎస్ఆర్ఆర్‌తోట మెయిన్ పైప్‌లైన్ ఏర్పాటు చేశారని, కనెక్షన్ ఇవ్వలేదని, నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఫిర్యాదు అందజేశారు.
- 3వ డివిజన్ ఆరేపల్లి మెయిన్ రోడ్డు నుంచి శ్రీరామ కాలనీ బుద్ధ భవన్ వరకు డ్రెయినేజీల్లో చెట్ల పొదలున్నాయని, శుభ్రం చేసి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.
- రసాయనాలతో కూడిన వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయడం వల్ల చెరువులు కలుషితమవుతున్నాయని, వాటి తయారీపై నిషేధం విధించాలని కె.ప్రకాశ్ కోరారు.
- గవిచర్ల క్రాస్ రోడ్డు సాయినగర్ కాలనీలో మొబైల్ టవర్ నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని గణేశ్‌నగర్, రెహమత్ నగర్ కాలనీల వాసులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ స్నేహనగర్, యాదవనగర్‌లో అసంపూర్తి పనులు పూర్తయ్యేలా చూడాలని ఆయా కాలనీవాసులు ఫిర్యాదులు చేశారు.
- కాజీపేట వెంకటాద్రి నగర్‌లో మురుగు కాల్వ నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని రవి పేర్కొన్నారు.
- 10వ డివిజన్ శ్రీ రాంనగర్ పద్మాక్షమ్మ కాలనీ రోడ్డుకిరువైపులా.. సైడ్ కాల్వ నిర్మించాలని కాలనీవాసులు విన్నవించారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి



ఇన్నర్ రింగ్ రోడ్డులో తన ఇల్లు పోయిందని, 'కుడా' ద్వారా పరిహారం ఇవ్వాలని మతిస్థిమితం లేని కొడుకుని తీసుకుని కలెక్టరేట్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వస్తున్న తల్లిదండ్రులు



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ప్రజలు

వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య

వరంగల్: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతులు సమర్పించారు. ఇందులో రెవెన్యూ శాఖ 55, పౌర సరఫరాలశాఖ 4, వైద్య ఆరోగ్య శాఖ 4, సంక్షేమ శాఖ4, ఇతర శాఖలకు సంబంధించినవి 14, మొత్తం 81 దరఖాస్తులను కలెక్టర్ ప్రావీణ్య, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓలు సీతం దత్తు, కృష్ణవేణితో కలిసి స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. 'మా అమ్మ పేరిట ఉన్న 600గజాల స్థలం, ఇల్లు ఇన్నర్ రింగ్‌రోడ్‌లో పోతోంది. ఇంటికి రూ.14లక్షలు నష్టపరిహారంగా నిర్ధారించి మూడేళ్లయినా నేటికీ అందించలేదు. నా కుమారుడు దివ్యాంగుడు. వైద్యం చేయించలేని దుస్థితిలో ఉన్నాం. వెంటనే నష్ట పరిహారం అందించడంతోపాటు స్థలం, ఇల్లు, కేటాయిచాలి' అని నగరానికి చెందిన రియాజొద్దీన్ వినతిపత్రం అందించాడు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్‌ను నియంత్రించాలి

పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించేందుకు జిల్లా అధికారులే ముందుండాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ నియంత్రణ ప్రచార పోస్టర్లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈసమావేశంలో ఆర్డీ ఓలు సీతం దత్తు, కృష్ణవేణి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి పాల్గొన్నారు.

హనుమకొండలో..

కాజీపేట: ప్రజలు ఎంతో నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమంలో చేస్తున్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడానికి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌తో పాటు అధికారులు జిల్లా ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 111 మంది వినతులు సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగ పద్మజ, డీఎంహెచ్ఓ సాంబశివరావు, జెడ్పీ సీఈఓ వేదవతి పాల్గొన్నారు.


ఆర్టీసీ సేవల్ని వినియోగించుకోవాలి: కలెక్టర్



వేలేరు: ఆర్టీసీ సేవల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం ఎర్రబెల్లి గ్రామం నుంచి హనుమకొండ వరకు ఆర్టీసీ బస్సు సేవలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం వసంత, డీప్యూటీ ఆర్ఎం భానుకిరణ్, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, తహసీల్దార్ కోమి పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్: జిల్లాలోని మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై జరుగుతున్న ఇంటింటి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం ఎస్ఐటీ దర్గా రోడ్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ మొబైల్ అప్లికేషన్ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జల జీవన్ మిషన్ ద్వారా సర్వే నిర్వహించడం జరుగుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాల మేరకు తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తుందన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రస్తుతం అందిస్తున్న తాగునీరు సరిపోతుందా? అధికంగా అవసరం ఉందా? అనే విషయాలు తెలుసుకునేందుకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీఓలు, ఏపీఓలు, ఏపీఎంలు టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్, ఐకేపీ సీసీలను సర్వే అధికారులుగా నియమించినట్లు తెలిపారు. 10 రోజుల్లో సర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లా నుంచి మొబైల్ అప్లికేషన్‌పై హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లచే ప్రొజెక్టర్ ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించి సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ రామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకట రమణారెడ్డి, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నగరానికి మరిన్ని స్మార్ట్ సిటీ రోడ్లు

- రూ.120 కోట్లతో 21 ప్రాజెక్టులకు ఆమోదం
- తాగునీటి బలోపేతానికి నిధులు



స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులపై హైదరాబాద్‌లో సమావేశమైన అధికారులు

వరంగల్ అర్బన్: మహా నగరంలో మరిన్ని స్మార్ట్‌సిటీ రోడ్లుగా అభివృద్ధి చెందనున్నాయి. రోడ్ల విస్తరణ, సీసీ, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, పుట్‌పాత్‌ల నిర్మాణంతో ఆధునికతను సంతరించుకోనున్నాయి. అంతేకాకుండా.. నగరంలో తాగునీటి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రాణాళిక రూపొందించారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిన రూ.120 కోట్లతో చేపట్టనున్న 21 ప్రాజెక్టులకు సంబంధించిన టెండర్లను హైదరాబాద్‌లో సోమవారం ఓపెన్ చేశారు. పబ్లిక్ అండ్ హెల్త్ ఈఎన్సీ జియాఉద్దీన్ నేతృత్వంలో సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ దివ్య దేవరాజన్, జీడబ్ల్యూఎంసీ స్మార్ట్ సిటీ సీఈఓ, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, హనుమకొండ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర హాజరయ్యారు. సాంకేతిక నిపుణుల కమిటీ టెండర్లను క్షుణ్ణంగా పరిశీలించి అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో.. వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాల్లో రోడ్లకు మహర్దశ పట్టనుంది.

యాజమాన్య పద్ధతులతో సిరులు

- అందుబాటులో అవసరమైన విత్తనాలు
- రైతులు సలహాలు పాటించాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో వ్యవసాయ అధికారులు
- విత్తన, ఎరువు, పంట రక్షణ చర్యలను అడిగి తెలుసుకున్న రైతులు



ఫోన్ ఇన్‌లో రైతుతో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి ఫోన్ ఇన్

హన్మకొండ: సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా సిరులు పండించవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులకు అవసరమైన అధిక దిగుబడులిచ్చే వంగడాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని, నాసిరకం విత్తనాలు విక్రయించకుండా, విత్తనాలు బ్లాక్ చేయకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రత్యేక స్క్వాడ్‌ను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు బ్లాక్‌లో అమ్మితే.. కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. వానాకాలం సాగుపై సోమవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, సహాయ సంచాలకుడు కె.దామోదర్‌రెడ్డి, డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్, వ్యవసాయ శాస్త్రవేత్త దిలీప్‌కుమార్ రైతులకు సలహాలు, సూచనలు అందించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వాటిలో కొన్ని ఇలా..

ప్రశ్న: పత్తి విత్తనాలు నాటాం. వర్షాలు పడడం లేదు. మొలకెత్తినట్లు కనిపిస్తున్నాయి. ఏం చేయాలి?
– శ్రీనివాస్, దామెర

జవాబు: భూమిలో ఉన్న తేమకు విత్తు పగిలి ఉంటుంది. నీరు ఉంటే తడులు ఇవ్వండి. వాతావరణ శాఖ వర్షాలున్నాయని చెబుతోంది. లేకపోతే తడులు ఇవ్వాలి. పొడి దుక్కుల్లో విత్తుకోవద్దు. పొడి దుక్కిలో గడ్డి మందు కొట్టొద్దు. తడి ఉన్నప్పుడే గడ్డి మందు చల్లాలి. వర్షం కురిస్తే మళ్లీ విత్తుకోవచ్చు.

ప్రశ్న: కొందరు అధిక ధరకు విత్తనాలు విక్రయిస్తున్నారు?
– అమ్మ అశోక్, పెద్ద కోడెపాక

జవాబు: అధిక ధరలకు విక్రయించకుండా, నాసిరకం విత్తనాలు అమ్మకుండా ప్రతీ మండలంలో ప్రత్యేక స్క్వాడ్‌లను ఏర్పాటు చేశాం. వారు పరిశీలించి చర్యలు తీసుకుంటారు.

ప్రశ్న: దొడ్డు రకం జేజేలు గత వానాకాలం సాగు చేశా. ఈసారి పడిపోని, సన్న రకం విత్తనాల వివరాలు తెలపండి?
– అరికిల్ల దేవయ్య, మైలారం

జవాబు: కేఎన్ఎం-1638, కేఎన్ఎం-733 రకం సాగు చేసుకోవచ్చు. నీటి లభ్యత అధికంగా ఉంటే.. బీపీటీ-5204, వరంగల్ సన్నాలు, వరంగల్ సాంబ కూడా సాగు చేసుకోవచ్చు. వీటితో చేను పడిపోదు. ఎకరాకు దిగుబడి 35 నుంచి 49 బస్తాల దిగుబడి వస్తుంది. నీరు తక్కువగా ఉంటే తెలంగాణ సోనా సాగు చేసుకోవచ్చు. ఈ పంటకు యూరియా ఎక్కువగా వాడొద్దు. ఇది ఎత్తు పెరుగుతుంది. సాగు నీరు అధికంగా ఉంటే దీర్ఘకాలిక రకాలు ఎంచుకోవచ్చు.

ప్రశ్న: తొలకరి వర్షాలకు పత్తి విత్తనాలు నాటాం. మొలకెత్త లేదు. ఎప్పటి వరకు పత్తి సాగు చేసుకోవచ్చు.
– నూనేటి కుమారస్వామి, కాట్రపల్లి

జవాబు: పత్తి విత్తనాలు నాటడానికి ఈ నెలాఖరు వరకు సమయం ఉంది. జూలై 15 వరకు విత్తుకోవచ్చు.

ప్రశ్న: విత్తన శుద్ధి ఎలా చేసుకోవాలి?
– రవి, ఆత్మకూరు

జవాబు: వరి విత్తనాలను ఎం-45, లేదా కార్బండిజంతో విత్తన శుద్ధి చేసుకోవాలి. ఎం-46 నీటిలో కలిపి నానబెట్టుకోవాలి. కిలో తడి విత్తనాలకు కార్బండిజం ఒక గ్రాం లీటర్ నీటిలో కలిపి పట్టించాలి. ఒక గ్రామ్ కార్బండిజం కలిపి పొడి విత్తనాలకు పట్టించి ఆరబోయాలి. గడ్డి విత్తనాలు అనేక రకాలున్నాయి.

ప్రశ్న: కందులు ఎప్పటి వరకు విత్తుకోవచ్చు?
– రాము, తిరుమలగిరి

జవాబు: కందులు విత్తుకోవడానికి సమయం ఉంది. వ్యవసాయ పరిశోధన స్థానంలో మంచి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: మిరప తోట సాగు చేయాలి. ఇప్పుడు విత్తనాలు వేసుకోవచ్చా?
– రామిశెట్టి రాజయ్య, కమలాపూర్

జవాబు: మిరప సాగుకు సమయం ఉంది. సాలు తోట వేసుకునే రైతులు ఇప్పుడు వేసుకోవచ్చు. నారు పెంచి సాగు చేసే వారికి ఇంకా రెండు నెలల సమయముంది. స్థలం ఖాళీగా ఉంచొద్దనుకుంటే.. పెసర సాగు చేసుకోవచ్చు. ఇది పంట తీసుకోవడంతో పాటు పచ్చి రొట్ట ఎరువుగా పనికి వస్తుంది.

ప్రశ్న: ఒలిపిడి సమస్య చాలా ఎక్కువగా ఉంది. దీని నివారణకు ఏం చేయాలి?
– ప్రవీణ్‌కుమార్, నడికూడ

జవాబు: ఒలిపిడి సమస్యకు శాస్త్రవేత్త డాక్టర్ నాగభూషణంను ఫోన్ నంబర్ 90101 04998లో సంప్రదించండి.

క్లుప్తంగా

టీఎస్ క్యాబ్ అధ్యక్షుడిగా 'మార్నేని'



మార్నేని రవీందర్‌రావును అభినందిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కాజీపేట అర్బన్ : తెలంగాణ రాష్ట్ర సహకార ఎపెక్స్ బ్యాంక్ (టీఎస్ క్యాబ్) అధ్యక్షుడిగా వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఉపాధ్యక్షుడిగా హైదరాబాద్ డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను నియమిస్తూ సహకార సంఘాల రిజిస్ట్రార్ డైరెక్టర్ హరిత సోమవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మార్నేని రవీందర్‌రావు.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. మార్నేని రవీందర్‌రావును అభినందించారు. కార్యక్రమంలో సీసీ అండ్ ఆర్‌సీఎస్ డైరెక్టర్ హరిత, టీఎస్ క్యాబ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు చిట్టి దేవేందర్‌రెడ్డి, కుంటా రమేశ్‌రెడ్డి, మాజీ వరంగల్ సీఈఓ చిన్నారావు, జిల్లా యూనియన్ నాయకులు కృష్ణమోహన్, రజిత తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క బ్యారేజీ వద్ద మొసలి..

- గోదావరి నదిలో జారవిడిచిన అటవీ శాఖ అధికారులు



బ్యారేజీపై ఉన్న మొసలి

ఏటూరునాగారం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజీపైకి సోమవారం మొసలి చేరింది. వారం రోజుల నుంచి కాళేశ్వరం నుంచి నీరు వదులుతుండడంతో సమ్మక్క బ్యారేజీలోకి వరద చేరుతుంది. ఈ క్రమంలో మొసలి బ్యారేజీ పై గేటు సమీపంలో రోడ్డు మీద చేరి ఉంది. దీనిని చూసి ప్రజలు భయభ్రాంతులకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ జిస్మాయిల్, డీఆర్ఓ అఫ్సరున్నీసా, బీట్ ఆఫీసర్ వరలక్ష్మి, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మొసలిని చాకచాక్యంగా పట్టుకుని మళ్లీ గోదావరిలో జారవిడిచారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య



నిఖిలేష్(ఫైల్)

కాశిబుగ్గ : రైలు కింద పడి ఓ సెక్యూరిటీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాజీపేట- వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం .. హనుమకొండ కాపువాడకు చెందిన నాగపురి నిఖిలేష్(34) హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా దంపతుల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం భార్యతో మరోసారి గొడవ పెట్టుకున్న నిఖిలేష్.. డ్యూటీకి వెళ్తుతున్నానని ఇంట్లో చెప్పి హంటర్ రోడ్డులోని చిన్న బ్రిడ్జి సమీపంలో రైల్వే ట్రాక్‌పై వచ్చాడు. మిత్రుడికి తాను చనిపోతున్నాని, అందరిని మంచిగా చూసుకో తమ్మి అని ఫోన్ చేసి అదే రోజు రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి రాజు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించామని సీఐ సోమవారం తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

'చిటుకు' చిట్కా..

టీకాతోనే జీవాల్లో చిటుకు రోగం నియంత్రణ

- నిర్లక్ష్యంగా ఉంటే మొదటికే ప్రమాదం
- పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి
- పశుసంవర్ధక శాఖ అధికారులు సూచనలు



చెన్నారావుపేట: తొలకరి (వర్షం) పలకరించింది. భూమిపై గడ్డి చిగురిస్తోంది. అయితే ఇప్పుడే ఆ గడ్డి మేస్తే జీవాలు (గొర్రెలు, మేకలు) త్వరగా 'చిటుకు' రోగం బారిన పడి నిమిషాల్లోనే మృత్యువాత పడతాయి. అందుకే 'చిటుకు' రోగంపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో సుమారు గొర్రెలు 7,19,075, మేకలు 1,01,544 ఉన్నాయి. వీటికి 'చిటుక' వ్యాధి సోకకుండా, నివారణకు ప్రభుత్వం ఇప్పటికే టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ అధికారులు వ్యాధి ఎప్పుడు వస్తుంది? లక్షణాలు ఎలా ఉంటాయి ? నివారణ పద్ధతులపై పెంపకందారులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

వ్యాపించే విధానం..

గొర్రెలు, మేకలకు గాలికుంటు, మశూచి, పీపీఆర్, చిటుకు రోగం, దొమ్మ, గొంతువాపు మొదలైన అంటువ్యాధులు త్వరగా సోకుతాయి. ఒక మంద నుంచి మరో మందకు అత్యంత వేగంగా, సులభంగా వ్యాపించి ప్రాణనష్టాన్ని కలిగిస్తాయి. చాలా సందర్భాల్లో చికిత్స చేసేందుకు తగిన వ్యవధి కూడా ఉండదు. ఇలాంటి ప్రమాదకర, ప్రాణాంతక వ్యాధులకు చికిత్స బదులు నివారణే ముఖ్యమైందని గుర్తించాలి. అంటు వ్యాధులు సోకక ముదే ఈ వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే గొర్రెలు, మేకల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

గొర్రెలకు ఎక్కువగా సోకే ప్రమాదం..

ఈ చిటుకు వ్యాధి మేకలకన్నా గొర్రెలకు ఎక్కువగా సోకే ప్రమాదం ఉంది. తొలకరిలో పెరిగిన పచ్చికను అతిగా మేయడం వల్ల శరీరంలో ఎప్సిలాల్ అనే విష పదార్థం విడుదల కావడంతో ఈ వ్యాధి సోకుంది.

చిటుకు వ్యాధి లక్షణాలు..

రాత్రి బాగా ఉండి తెల్లవారే సరికల్లా ఎక్కువ సంఖ్యల్లో జీవాలు మృత్యువాత పడుతుంటాయి. కళ్ల ముందే ఎలాంటి లక్షణాలు లేకుండా హఠాత్తుగా గాలిలోకి చెంగున ఎగిరి కిందపడి మరణిస్తాయి. జ్వరం, పళ్ల కొరకడం, వనకడం, బిగుసుకుని పోవడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం, చెట్లకు గట్టిగా తలను ఆనించి ఉండడం, కాళ్లు బిగిసి పట్టి నడవడం, శ్వాస కష్టమవడం మొదలకు లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి తీవ్రత దశలో అధిక విరేచనాలు, కడుపు నొప్పి, మందకొడిగా ఉండడం, సరిగ్గా మేయకపోవడం వంటి లక్షణాలుంటాయి.



పచ్చిక మేస్తున్న గొర్రెలు

నివారణ చర్యలు..

- వ్యాధి రాకుండా ముందుగానే టీకాలు వేయించాలి. అకాల వర్షాలు, తొలకరి వర్షాలకు పెరిగిన గడ్డిని ఎక్కువగా మేపకూడదు.
- వరి కోసిన తర్వాత మిగిలిన కర్రలను ఎక్కువగా మేపకూడదు. గొర్రెలు, మేకలకు మూడు నెలలకోసారి నట్టల నివారణ మందు వేయాలి.
- 30 రోజుల వయసు కలిగిన గొర్రె, మేక పిల్లలకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. మూడు నెలల తర్వాత బూస్టర్ డోస్ వేయించాలి. గొర్రెలు, మేకలకు ఆరు నెలలకు ఒకసారి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. గొర్రె పిల్లలు అత్యధికంగా పాలు తాగకుండా గమనించాలి.
- పాలు తాగే స్థితి నుంచి ఒకేసారి దాణాకు మార్చకుండా క్రమ క్రమంగా మార్చుకుంటూ వెళ్లాలి.
- మేకలకు పూర్తిగా పప్పు జాతి పశుగ్రాసాలు వేయకూడదు.

నివారణతో 'చిటుకు' అంతం



చిటుకు వ్యాధి సోకిన జీవాలకు చికిత్స చేసే వ్యవధి ఉండదు. వ్యాధి రాకుండా ముందుగానే టీకాలు వేయించాలి. ఏడాది వయసున్న గొర్రెల్లో ఎక్కువగా ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకకముందే నిరోధక టీకాలు వేయిస్తే జీవాల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. టీకాలు వేయడం ప్రారంభించాం. కాపరులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి.

–మంజీలాల్, పశువైద్యాధికారి, చెన్నారావుపేట

నిబంధనల మేరకు బస్సులు నడపాలి

- డీటీసీ డాక్టర్ శ్రీనివాస్ పుప్పాల



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్ పుప్పాల

హసన్‌పర్తి: నిబంధనల మేరకు బస్సులు నడపాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ శ్రీనివాస్ పుప్పాల హెచ్చరించారు. రోడ్డు భద్రతపై ప్రైవేట్ పాఠశాలల యాజమానులు, డ్రైవర్లకు సోమవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పుప్పాల.. స్కూల్ బస్సు డ్రైవర్లు పిల్లలను తీసుకెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయి? వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. కచ్చితంగా సీటు బెల్ట్ ధరించాలన్నారు. అనంతరం శాయంపేట మెడికల్ ఆఫీసర్ సాయి.. సీపీఆర్ గురించి వివరించారు. అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు.. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. అనంతరం డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని డ్రైవర్లకు ట్రైనింగ్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రవాణాశాఖ అధికారి జి. వేణుగోపాల్, వడుప్సా జిల్లా అధ్యక్షుడు మాదాల సతీశ్‌కుమార్, వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిశోర్, వడుప్సా ప్రతినిధులు జ్ఞానేశ్వర్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాపం..పసిపాప

- క్యాన్సర్ మహమ్మారితో చిన్నారి మృతి
- తహసీల్దార్ బజారులో ఘటన



షబానా (ఫైల్)

గార్ల: పాపం.. పసిపాప.. క్యాన్సర్ మహమ్మారితో 15 నెలల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన తహసీల్దార్ బజారులో చోటుచేసుకుంది. వివరాలు ఇలాఉన్నాయి. గార్ల తహసీల్దార్ బజారుకు చెందిన ఎం షఫీ చిన్న కూతురు 15 నెలల షబానాకు గత జనవరిలో ఆరోగ్యం బాగలేకపోవడంతో ఖమ్మం లోని ప్రైవేటు ఆసుపత్రిలో చూపించడంతో వైద్య పరీక్షల్లో క్యాన్సర్‌గా నిర్ధారణ అయింది. దీంతో చిన్నారిని అప్పటి నుంచి హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స జరిపిస్తున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. దీంతో చిన్నారి మృతదేహం మీదపడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

టీజీ ఈ-సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం పత్రం అందజేస్తున్న అధికారులు

రామన్నపేట : పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తయిన విద్యార్థులు ఇంజనీరింగ్ 2వ సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహించే టీజీ ఈ-సెట్ -2024 కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైందని క్యాంపు అధికారి, కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ తెలిపారు. కాగా, తొలి రోజు 445 అభ్యర్థులు తమ సర్టిఫికెట్ వెరికేషన్ కోసం హాజరైనట్లు తెలిపారు. ఈనెల 11లోపు స్లాట్స్ ఎంచుకున్న వారికి 12వ తేదీ వరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల ధ్రువీకరణ జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు తాము బుక్ చేసుకున్న స్లాట్ టైమ్‌కు ఎంచుకున్న సెంటర్‌కు వెళ్లి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. అనంతరం తాము కోరుకున్న బీటెక్ / బీ ఫార్మసీ ప్రోగ్రాం ఎంచుకుని tgecec-t.nic.in వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్స్‌ను ఈనెల 14వ తేదీ వరకు ఇచ్చుకోవచ్చని తెలిపారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో కళాశాల విభాగాధిపతులు ఈగ మల్లికార్జున్, గన్ను నటరాజశేఖర్, సిస్టమ్ అనలిస్ట్ వేముల రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలను నివారించాలి

- సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

కాజీపేట అర్బన్ : విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు క్షేత్రస్థాయిలో భద్రత పరమైన చర్యలు చేపట్టాలని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం సంస్థ పరిధి 16 సర్కిళ్లలోని డీఈ, ఏఈలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడారు. నాసిరకం విద్యుత్ పరికరాల వినియోగం, స్విచ్‌బోర్డు, మోటార్ స్టార్టర్ల వద్ద ఎర్తింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సామాన్యులతో పాటు సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. జీరో విద్యుత్ ప్రమాదాల సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ప్రమాదకారకుడిని కఠినంగా శిక్షించాలి

- మృతుల కుటుంబీకుల ఆందోళన
- మూడు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు



ఆందోళన చేస్తున్న మృతుల కుటుంబీకులు, రజక సంఘం నాయకులు

భూపాలపల్లి: వాహనం అతివేగంగా నడిపి ఇద్దరు యువకుల మృతికి కారణమైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలంటూ మృతుల కుటుంబీకులు, రజక సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన సోమవారం భూపాలపల్లి పట్టణంలో చోటు చేసుకుంది. భూపాలపల్లి మండలం కమలాపూర్‌కు చెందిన రేగళ్ల నరేశ్(29), ప్రమోద్(21), సిద్దు ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై గ్రామ సమీపంలో బహిర్భూమికి వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన బందం అనిల్‌రెడ్డి కారులో అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో నరేశ్ అక్కడికక్కడే మృతి చెందగా ప్రమోద్‌ను వరంగల్‌కు తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. సిద్దు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. కాగా, ఆదివారం రాత్రి నరేశ్, ప్రమోద్ కుటుంబీకులు భూపాలపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను సోమవారం పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు, రజక కుల సంఘం నాయకులు వంద పడకల ఆసుపత్రికి చేరుకున్నారు. సాయంత్రం 5 గంటల అనంతరం ఆందోళన చేపట్టారు. దీంతో భూపాలపల్లి-పరకాల జాతీయ రహదారిపై సుమారు రెండు గంటల పాటు మూడు కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ నిలిచింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని నిరసనను విరమించజేయడానికి యత్నించినప్పటికీ ఆందోళనకారులు వినలేదు. చివరకు పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని, నిందితుడిపై కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



శ్రవణ్ (ఫైల్)

హసన్‌పర్తి: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గుండ్లసింగారంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సముద్రాల శ్రవణ్‌కుమార్(40) ప్రైవేట్ ఉద్యోగి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తన స్నేహితులతో ఆత్మీయ సమ్మేళనం గురించి చర్చించడానికి శ్రవణ్ బైక్‌పై ఆదివారం మధ్యాహ్నం నాగారం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నాగారం నుంచి గుండ్లసింగారం వైపునకు బయలుదేరాడు. అయితే అర్ధరాత్రి వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. కాగా, ఉదయం ముచ్చర్ల శివారులోని మిలినియం స్కూల్ సమీపంలో శ్రవణ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. సమీపంలోని పంట పొలాల్లో మృతదేహాన్ని గుర్తించారు. కాగా, తన కుమారుడు శ్రవణ్‌కుమార్ మృతిపై అనుమానం ఉందని మృతుడి తండ్రి సదానందం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ జె. సురేశ్ తెలిపారు.

తల్లిని చంపిన తనయుడి అరెస్ట్

- గొడవ ఆపడానికి వచ్చినందుకు ఘాతుకం
- వివరాలు వెల్లడించిన పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిశోర్‌కుమార్

శాయంపేట : చింత చెట్టు వివాదంలో దంపతుల మధ్య గొడవ జరుగుతుండగా అడ్డు వచ్చిన తల్లిని కర్రతో మోది హత్య చేసిన తనయుడు మోతే తిరుపతి రెడ్డిని సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం శాయంపేట పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుడు తిరుపతి రెడ్డి అరెస్ట్ చూపుతూ వివరాలు వెల్లడించారు. మండలంలోని కొప్పులకు చెందిన బేతు జయపాల్ రెడ్డి తన ఇంటి ఎదుట ఉన్న గుంట స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన మోతే తిరుపతి రెడ్డికి రూ. 3లక్షలకు విక్రయించారు. ఈ నెల 8న మధ్యాహ్నం జైపాల్ రెడ్డి ఆ స్థలంలో ఉన్న చింత చెట్టును కొట్టి వేస్తుండగా తిరుపతి రెడ్డి.. స్థలం కొన్నానని చెట్టు ఎందుకు కొడుతున్నావని అడ్డుకున్నాడు. స్థలం అమ్మానని, చెట్టు అమ్మలేదని జైపాల్ రెడ్డి తేల్చడంతో ఇద్దరి మధ్య వాదన జరుగుతుండగా తిరుపతి రెడ్డి భార్య నాగమణి గొడవ వద్దని తన భర్తను ఇంట్లోకి తీసుకెళ్లింది. చెట్టు కొడుతుంటే అడ్డుకుంటున్న తనను ఎందుకు ఇంట్లోకి తీసుకొచ్చావని ఆమెతో గొడవపడి కొట్టే ప్రయత్నం చేస్తుండగా తిరుపతి రెడ్డి తల్లి అమృతమ్మ అడ్డుకోగా పక్కన ఉన్న కర్రతో తల్లి తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో అమృతమ్మను వెంటనే వరంగల్ ఎంజీఎం తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనలో నిందితుడు తిరుపతి రెడ్డి గోడ కూలి తన తల్లి చనిపోయినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేయగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం చేరవేయడంతో వారు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టగా తల్లిని తనయుడే కొట్టి చంపాడని తేలింది. ఈ ఘటనపై అమృతమ్మ కూతురు దూదిపాల రాణి ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రమోద్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు పరారీలో ఉండడంతో గాలింపు చర్యలు చేపట్టగా హనుమకొండ బస్టాండ్ ప్రాంతంలో కనిపించాడు. అయితే నిందితుడు తిరుపతి రెడ్డి సోమవారం పోలీసులకు సరెండర్ కావడంతో విచారించగా తాను కర్రతో మోదడంతోనే తల్లి మృతి చెందిందని నేరం ఒప్పుకున్నాడు. దీంతో అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో శాయంపేట సీఐ రంజిత్‌రావు, ఎస్సై ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

తండ్రికి మంచినీళ్లు అందించి అనంతలోకాలకు..

రోటావేటర్‌లో పడి బాలుడి దుర్మరణం

- లైన్ తండాలో ఘటన
- శోకసంద్రంలో కుటుంబీకులు



రోదిస్తున్న బాలుడి కుటుంబ సభ్యులు



బాలు (ఫైల్)

నల్లబెల్లి: చెలుకలో మండుటెండలో ట్రాక్టర్ రోటావేటర్ నడుపుతున్న తండ్రి దాహం తీర్చడానికి వాటర్ బాటిల్ తీసుకుని పరిగెత్తి అందించిన బాలుడు.. అంతలోనే అనంతలోకాలకు చేరాడు. సరదాగా ట్రాక్టర్‌పై కూర్చోగా తండ్రి దున్నుతున్న క్రమంలో రోటావేటర్‌లో పడి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని గోవిందాపూర్ శివారు లైన్ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై రామారావు కథనం ప్రకారం.. లైన్ తండా గ్రామానికి చెందిన గుగులోత్ యశోద, రాజు దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాజు తన బావ ట్రాక్టర్ తీసుకుని సోమవారం ఉదయం లైన్‌తండా శివారులోని తన వ్యవసాయ భూమిలో పత్తి విత్తనాలు నాటేందుకు దుక్కిని చదును చేసేందుకు తన చిన్న కుమారుడు బాలు(12)తో కలిసి వెళ్లాడు. బాలు చెలకలోని చెట్టు నీడలో సేదాదీరుతూ ఆడుకుంటున్నాడు. ట్రాక్టర్ రోటవేటర్ నడుపుతున్న రాజుకు దాహం వేడయంతో అక్కడే ఉన్న తన కుమారుడు బాలును మంచినీళ్లు తీసుకురావాలని కోరాడు. దీంతో వాటర్ బాటిల్ తీసుకుని పరుగున వెళ్లిన కుమారుడుని గుండెకు హత్తుకుని మంచినీళ్లు తాగాడు. అనంతరం సరదాగా ట్రాక్టర్‌పై కూర్చోపెట్టుకుని దుక్కిదున్నుతుండగా బాలు ఒక్కసారిగా కిందపడడంతో రోటవేటర్‌లో చిక్కుకొని శరీర భాగాలు ముక్కలుముక్కలై అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లముందే కుమారుడు దుర్మరణం చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించాడు. బాలు మృతితో బాధిత కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఈ ఘటనపై మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

మంచినీళ్ల కోసం వెళ్లి మృత్యుఒడికి..

- బావిలో పడి యువతి మృతి
- సికింద్రాబాద్ తండాలో ఘటన



అనిత (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మంచినీళ్ల కోసం వెళ్లిన ఓ యువతి మృత్యుఒడికి చేరింది. బావిలోపడి మృతి చెందింది. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ మండలం సికింద్రాబాద్ తండా గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై దీపికారెడ్డి కథనం ప్రకారం.. తండాకు చెందిన భూక్య హుస్సేన్, అక్రి దంపతుల కూతురు అనిత (19) తల్లితో కలిసి పొలం పనులకు వెళ్లింది. కొంత సమయం తరువాత మంచినీళ్లు తీసుకురావడం కోసం వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. నీళ్లు తోడుతుండగా అందులో పడింది. అనిత కేకలు విన్న స్థానికులు వచ్చి బయటకు తీసిచూసేసరికి మృతిచెందింది. సమాచారం తెలుసుకుని పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘనటపై మృతురాలి తల్లి అక్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై దీపికారెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ తిరిగిరాని లోకాలకు..

- వాహనం కింద పడి బాలుడి దుర్మరణం
- దొనకొండలో ఘటన



సతీశ్ (ఫైల్)



సతీశ్‌పై నుంచి వెళ్లిన ట్రాక్టర్

దంతాలపల్లి : అప్పటి వరకు ఇంటి వద్ద స్నేహితలతో ఆడుకున్న ఓ బాలుడు.. తల్లిదండ్రులు, స్నేహితులకు ఇప్పుడే వస్తానని చెప్పి మృత్యు ఒడికి చేరారు. డ్రైవింగ్ చేస్తూ ట్రాక్టర్ కింద పడి తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దొనకొండలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నారాయణ మంగమ్మ, ఉప్పలయ్య దంపతులకు కూతురు ఉమామహేశ్వరి, కూమారులు వేణు, సతీశ్ ఉన్నారు. ఉప్పలయ్య, పెద్దకుమారుడు వేణు అమాయకులు. దీంతో తల్లి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. రెండో కుమారుడు సతీశ్(15) సూర్యాపేట జిల్లా నూతనకల్‌లో ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ ఇటీవల పదో తగతి పాసయ్యాడు. వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కోడి రమేశ్.. గ్రామంలో వేరే రైతు పొలం దున్నుతున్న తన ట్రాక్టర్ తీసుకురావాలని ఆడుకుంటున్న సతీశ్‌ను కోరాడు. రమేశ్ కోరిక మేరకు సతీశ్ ట్రాక్టర్‌ను తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ పెద్ద ఒరం ఎక్కడంతో సతీశ్ సీటుపై నుంచి జారి పడ్డాడు. కింద పడే సమయంలో తన కాలు చెప్పు ట్రాక్టర్ గేర్, బ్రేక్ మధ్యలో చిక్కుకుని ఉండడంతో ఇంజన్ వెనుక టైర్ సతీశ్ తల పైకి ఎక్కింది. గమనించిన కొంత మంది ఘటనాస్థలికి వెళ్లి చూడగా సతీశ్ అప్పటికే మృతి చెందాడు. దీంతో అప్పటి వరకు తమతో ఆడుకుంటున్న సతీశ్ మృతి చెందాడని తెలియడంతో స్నేహితులతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, కుటుంబానికి దిక్కు అవుతాడని అనుకున్న బాలుడు చనిపోవడంతో ఆ కుటుంబం గుండెలవిసేలా రోదించింది.

కుటుంబానికి న్యాయం చేయాలి

ట్రాక్టర్ యజమాని.. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ఖైసర్ పాషా(ఫైల్)

రఘునాథపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన హనుమకొండ- హైదరాబాద్ జాతీయ రహదారిపై నిడిగొండ రైల్వే బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ ఖైసర్ పాషా (38) ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి రఘునాథపల్లిలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి కుటుంబీకులతో కలిసి హాజరయ్యాడు. ఫంక్షన్ పూర్తయ్యాక అర్ధరాత్రి మహ్మద్ ఖైసర్ పాషా ద్విచక్ర వాహనంపై, కుటుంబీకులు కారులో బయలుదేరారు. మార్గమధ్యలో నిడిగొండ రైల్వే బ్రిడ్జి వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో వెనుక వస్తున్న కుటుంబీకులు రోడ్డుపై పడి ఉన్న మహ్మద్ ఖైసర్ పాషాను గుర్తించి బోరున విలపించారు. మృతుడికి భార్య సోని, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి అక్తర్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు.